## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రములోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో అనంతపురం టౌన్ లో నివాసం ఉంటున్న లీలా శ్రీవల్లి, అన్న గిరిధర్ మరియు తల్లిదండ్రులు శ్రీవల్లి పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమములో ఉంటున్న వృద్ధులకు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారు లీలా శ్రీవల్లికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు

## గుంటూరు జిల్లాలో ఎంఈసీ విభాగంలో టాప్ 2 గా నిలిచిన యాడికి విద్యార్థి లోహిత



యాడికి, ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రములోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో నివాసముంటున్న వర్షా ఎంటర్‌ప్రైజెస్ ప్రోప్రైటర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి కుమార్తె లోహిత ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చాటింది. గుంటూరు జిల్లా మాస్టర్ మైండ్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంఈసీ విభాగంలో చదువుతున్న ఆమె, బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 500 మార్కులకు గాను 493 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఈ ఫలితాలతో గుంటూరు జిల్లాలో ఎంఈసీ విభాగంలో టాప్ 2 స్థానం దక్కించుకొని యాడికి మండలానికి గర్వకారణంగా నిలిచింది. విద్యార్థిని లోహిత సాధించిన ఈ విజయంపై యాడికి గ్రామ ప్రజలు, కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఈ ఫలితం సాధ్యమైందని లోహిత తెలిపింది

## లీలావతి వృద్ధాశ్రమంలో అల్పాహారం



యాడికి, ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలో తూట్రాళ్లపల్లె గ్రామానికి చెందిన యలమకూరి రామాంజనేయులు, నాగేంద్రమ్మ దంపతుల మనవడు జెసి హర్షిత్ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి హర్షిత్ కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశ్రమంలోని వృద్ధులు కూడా హర్షిత్ కృష్ణ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు.

## యాడికిలో శ్రీ భద్రావతి భావనా ఋషీశ్వర స్వామి వారి ఉత్సవాలు



యాడికి, ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని శ్రీ భద్రావతి భావనా ఋషీశ్వర స్వామివారి వార్షిక ఉత్సవాలు ఈ నెల 21వ తేదీ మంగళవారం నుంచి 23వ తేదీ గురువారం వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు మంగళహారతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 వ తేదీ బుధవారం స్వామివారి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరగనుందని, సాయంత్రం ఉత్సవమూర్తుల రథోత్సవము నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలకు పద్మశాలీయ వంశస్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని శ్రీ బహోత్తమ పద్మశాలీయ సంఘం ఆలయ అధ్యక్షుడు జానపాటి గురుమూర్తి, ఉపాధ్యక్షుడు కాల్వ శ్రీనివాసులు, కార్యదర్శి లింగంపల్లి నాగరంగయ్య, కోశాధికారి కుంటుమల్ల కృష్ణ రంగఫణిబాబు, సంయుక్త కార్యదర్శి పోకూరి జయప్రసాద్ తెలిపారు

## యాడికి మండల వైసీపీ రైతు విభాగం కార్యనిర్వహక సభ్యునిగా పి కృష్ణయ్య



యాడికి, ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

యాడికి మండలంలో వైసీపీ పార్టీ సంస్థాగత బలోపేతానికి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వివిధ హోదాల్లో నియామకాలు చేపట్టారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్ నాయుడు సహకారంతో మండల వైసీపీ రైతు విభాగం కార్యనిర్వాహక సభ్యునిగా పి.కృష్ణయ్య (పొంతల కిట్ట) నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కృష్ణయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, బొంబాయి రమేష్ నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు

## చెరువు మట్టి రైతులకు, మరువ వంక శుభ్రతకు వినతి



యాడికి, ఏప్రిల్ 16 (అనంత ప్రభ )

యాడికి గ్రామపంచాయతీ కార్యాలయం నందు గురువారం జలధార కార్యక్రమం గ్రామసభను గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి వీరరాజు ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి అధికారి అరుణ్ కుమార్, ఇరిగేషన్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జలవనరుల శాఖ అధికారికి పలువురు నాయకులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. యాడికి పంచాయతీ పరిధిలోని పిన్నేపల్లి చెరువులో పూడికతీత పనులు చేపట్టి, చెరవులోని మట్టిని యంత్రాల సహాయంతో మండల పరిధిలోని రైతులు ఉచితంగా తరలించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా యాడికిలోని మరవ వంక పిచ్చిమొక్కలతో పూర్తిగా నిండిపోయిందని, గతంలో కురిసిన వర్షాలకు మరవవంక నుంచి వెళ్లాల్సిన వర్షపు నీరు కాలనీల్లోని ఇళ్లలోకి చేరి చేనేత కార్మికులకు తీవ్ర నష్టం కలిగిందని వివరించారు. వచ్చే వర్షాకాలానికి ముందుగానే పిచ్చిమొక్కలను తొలగించి, మరవవంకను శుభ్రపరిచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆది, టీడీపీ సీనియర్ నాయకులు గొర్తి రుద్రమనాయుడు, నరసింహ చౌదరి, కోడూరు నీలకంఠారెడ్డి, చిట్టెపు చంద్రశేఖర్ రెడ్డి, వాల్మీకి రవి, హాజీ పీరా, చాంద్ బాషా, చందు, వంకం నాగరాజు, మహమ్మద్ రఫీ, కోటవీధి షేక్షా తదితరులు పాల్గొన్నారు

## కూడేరు మండలం లో విస్తృత పర్యటనను చేపట్టిన జిల్లా కలెక్టర్



కూడేరు, ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

కూడేరు మండలంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ గురువారం రోజున విస్తృతంగా పర్యటించారు. కూడేరు మండలంలోని కొర్రకోడు పరిధిలోని పిఏబిఆర్ డ్యాం వద్ద సత్యసాయి వాటర్ సప్లయి స్కీం, అనంతపురం నగర పాలక సంస్థకు సంబంధించిన స్కీం, ఎన్ఎస్ఆర్డిడబ్ల్యుపి యూనిట్ లను, హెడ్ వర్క్ లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పిఏబిఆర్ డ్యాంలో ఎంత నీరు ఉంది, వేసవిలో త్రాగునీటికి ఎంతనీరు అవసరం అవుతుంది, తదితర వివరాలను జిల్లా ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేసవిలో త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఇందులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందులో భాగంగా అక్కడి వర్కర్లతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత సిఈఓతో మాట్లాడుతున్నామని, 2,3 నెలలకు సంబంధించి పేమెంట్ ఇచ్చే ఏర్పాట్లు చేయిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం మరుట్ల గ్రామంలో రీసర్వే పనులు, అసైన్ మెంట్ కు సంబంధించిన అర్జీల వివరాలను రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రసాదను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే యాక్టివిటీలను జాగ్రత్తగా చేపట్టాలని, అసైన్ మెంట్ అర్జీలను తనిఖీ చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తదనంతరం సుజాలాన్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, హెచ్ఎల్సి ఎస్ఈ సుధాకర్ రేవు, నగర పాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, కూడేరు తహసీల్దార్ ఉదయ భాస్కర్, రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్, ఎంపీడీవో కుల్లాయి స్వామి,పబ్లిక్ హెల్త్, మరియు ఆర్డబ్ల్యుఎస్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## లీడర్లను తయారు చేసే ఫ్యాక్టరీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం: లలితమ్మ



ఆదోని,ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

ఆదోని నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, నాయకుల్లో మనోస్థైర్యం పెంపు దిశగా ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. పార్థసారథి నిరంతరం కృషి చేస్తున్నారని అమరావతి నగర్ 35వ వార్డు మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ పేర్కొన్నారు. దీనికి నిదర్శనంగా సియం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఉదాహరణగా చూపించారు.

గ్రామ, వార్డు స్థాయి నాయకులకు ముందుగానే సమాచారం ఇచ్చి, లబ్ధిదారులను వారి ఇళ్ల నుండి తీసుకువచ్చి కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేయడం ఆదోని చరిత్రలో ఇదే తొలిసారి జరుగుతోందని ఆమె తెలిపారు. అంతేకాకుండా లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకుంటూ, వార్డు లేదా గ్రామ నాయకుల చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడం ద్వారా స్థానిక నాయకత్వానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు.

ఈ విధానం ద్వారా గ్రామ, వార్డు స్థాయిలో నాయకత్వం బలోపేతం అవుతుండగా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లీడర్లను తయారు చేసే ఫ్యాక్టరీగా మారిందని లలితమ్మ అభిప్రాయపడ్డారు. అమరావతి నగర్ 35వ వార్డుకు సంబంధించిన రెండు చెక్కుల ద్వారా రూ.1,05,000 పంపిణీ చేసినట్లు తెలిపారు.

వైద్యం అనంతరం అవసరమైన బిల్లులు క్యాంపు కార్యాలయం లేదా స్థానిక నాయకులకు అందజేస్తే, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో సియం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు.

పేదలకు అండగా నిలుస్తున్న సియం రిలీఫ్ ఫండ్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అలాగే సహకరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథికి లలితమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్, జనసేన పట్టణ అధ్యక్షుడు రేణువర్మ, నాయకులు ఎవి సురేష్, పరుశురాం, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం: ఎనిమిది మంది మృతి
## -- బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపిన గుడిసె ఆది కృష్ణమ్మ



మంత్రాలయం,ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

మంత్రాలయం చిలకలడోణ గ్రామ శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడం పట్ల కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాదకర ఘటన జిల్లావ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిందని ఆమె పేర్కొన్నారు.

ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఒక్కసారిగా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని, ఈ ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె కోరారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు రోడ్డు భద్రతపై కఠిన చర్యలు తీసుకోవాలని, రహదారి పరిస్థితులను సమీక్షించి అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆమె కోరారు




## డాల్ అనురాధకు ఘన సన్మానం
## స్టేట్ ర్యాంకులో రావడంతో సన్మానించిన కళాశాల సిబ్బంది




శింగనమల, ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కురుకుంట అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన సింగనమల మండలం సోధనపల్లి గ్రామానికి చెందిన డాల్ రమేష్ శివలక్ష్మి లకు చెందిన రెండవ కుమార్తె డాల్ అనురాధ ఇంటర్ పరీక్షలలో స్టేట్ ర్యాంక్ రావడంతో నేడు కురుకుంట కళాశాలలో కళాశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అనురాధకు ఘనమైన సన్మానం చేశారు. దీంతో తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి విద్యార్థిని అనురాధనా ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఇలా మీరు ఆదర్శం కావాలని విద్యార్థులకు ఉపాధ్యాయునీలు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు కళాశాల సిబ్బంది తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు..


## జిల్లా న్యాయవాద సంఘం గుమస్తా అధ్యక్షునికి సన్మాన కార్యక్రమం



అనంత,ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణం నందు గురువారం రోజున జిల్లా న్యాయవాద సంఘం గుమస్తా అధ్యక్ష పదవి కి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఇ. నరసింహులు కు శాలువాలు కప్పి సన్మాన కార్యక్రమాన్ని న్యాయవాద గుమస్తా సంఘం సభ్యులందరూ ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఇ. నరసింహులు న్యాయవాద సంఘం గుమస్తాల అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రామాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు మాత్రమే




ఆదోని,ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

పెద్ద హరివాణం గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన ఈ సమావేశాన్ని16-04-2026న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్య ఉన్నా పరిష్కరించే దిశగా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ గ్రామంలో దాదాపు 2 కోట్ల రూపాయల పనులు జరిగాయని, రాబోయే మూడు సంవత్సరాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని, ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వం ఇదే కూటమి ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పుట్టపర్తి ఆర్‌డీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ




పుట్టపర్తి,ఏప్రిల్ 16 (అనంత ప్రభ)

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ గారు ఈరోజు పుట్టపర్తిలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ నిర్వహణ, రికార్డుల నమోదు మరియు ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది హాజరును తనిఖీ చేసి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూమి వివాదాలు, మ్యుటేషన్లు మరియు ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యాలయంలోని రికార్డు రూమును పరిశీలించి, దస్త్రాలన్నీ క్రమ పద్ధతిలో కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా, వేగంగా అందాలని, కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు